నయనానందం.. లక్ష్మీనరసింహుడి రథోత్సవం

గరుడ వాహనంపై మాఢవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహ స్వామి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి11 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దివ్య విమాన రథోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. లక్ష్మి అమ్మవారిని ముప్పైమూడు కోట్ల దేవతల సాక్షిగా వివాహ మాడిన నరసింహస్వామిని దివ్యవిమాన రథంపై ఊరేగే తంతును ఆలయ ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు ఘనంగా నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు పాల్గొని తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాల నడుమ భక్తులు భజనలు చేస్తూ కోలాటాలు వేశారు. 'జై నారసింహ.. జయ జయ నారసింహ' అంటూ తిరువీధుల వెంట స్వామివారిని కొలుస్తూ ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. బ్రహ్మోత్సవంలో భాగంగా ఉదయం చతుర్వేద పారాయణాలు, నిత్య హవనములు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణ ఉత్సవమూర్తులను గరుడ వాహన సేవలో తీరువీధుల్లో ఊరేగించారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థం, సాయంత్రం 6 గంటలకు దేవతా ఉద్వాసన, శ్రీ పుష్ప యాగం, ద్వాదశారాధన, డోలోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ఆలయ ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్ ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వాసం కోల్పోయిన మదర్ డెయిరీ

- రాజాపేట పాల సొసైటీ చైర్మన్ భాస్కర్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ గౌడ్

రాజాపేట, ఫిబ్రవరి 11 : అప్పుల చెల్లింపు కోసం స్థిరాస్తుల అమ్మకం నిర్ణయంతో మదర్ డెయిరీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని రాజాపేట పాల సొసైటీ చైర్మన్ సందిల భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మదర్ డెయిరీ లాభాల బాటలో కొనసాగుతున్నదని చెప్పుకుంటూ పాలకులు అందిన కాడికి దోచుకోడంతో నేడు పీకల్లోతు అప్పుల్లోకి నెట్టేశారని ఆరోపించారు. డెయిరీ నష్టాల్లో కొనసాగుతుందంటే చైర్మన్, డైరెక్టర్లే కారణమని తెలిపారు. మార్కెట్‌లో ప్రైవేట్ డెయిరీలతో పోటీ పడాల్సింది పోయి, మదర్ డెయిరీ దిగజారి పోవడం విచారకరమన్నారు. పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోతుండడంతో స్థానిక పాల సంఘం చైర్మన్‌లకు, పాడి రైతులకు మధ్య దూరం పెంచి, చైర్మన్ పదవికే గౌరవ భంగం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల పాల బిల్లును వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. మదర్ డెయిరీ ఒక ప్రైవేట్ వ్యక్తికి ధారాదత్తం చేశారని, అలాంటి వ్యక్తికి రోజు లీటర్ పాలకు రూ 1. 75 చెల్లిస్తుండడంతో రోజుకు రూ 1. 15 లక్షలు కేవలం ఆ ప్రైవేట్ వ్యక్తికే చెందుతున్నాయని తెలిపారు. నెలకు రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4.50 కోట్లు సదరు వ్యక్తికే చెందుతాయని చెప్పారు. ఈ సమావేశంలో చైర్మన్లు జన్నపల్లి బాలరాజురెడ్డి, పోసు గొండ దశరథ, సందేల వెంకటేశ్, మేక రమేశ్, సిగ్గల సిద్ధులు, బల్ద సిద్ధులు, కోయ రమేశ్, గుంటి రాజయ్య పాల్గొన్నారు.

ఆలేరు బస్టాండ్‌లో మహిళల మరుగుదొడ్లకు తాళాలు

- రాత్రిపూట ఇబ్బంది పడుతున్న మహిళలు


తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 11 : ప్రయాణికులకు అందుబాటులో ఉండాల్సిన మరుగుదొడ్లకు ఆలేరు బస్టాండ్‌లో తాళాలు వేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలు అయిందంటే వాటిని మూసేసి వెళ్తున్నారు. దాంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురుషుల మరుగుదొడ్లకు తాళం వేయకుండా కేవలం స్త్రీల మరుగుదొడ్లకే తాళం వేయడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్టాండ్ మీదుగా వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ బస్సులు వెళ్తుంటాయి. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణిస్తుంటారు. మహిళలకు ఉచిత బస్సు ఉండడంతో వారి సంఖ్య ఎక్కువగానే ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఆలేరులో మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో రాత్రి బస్టాండ్ వెనుకాల ఖాళీ ప్రదేశంలో బహిర్భూమికి వెళాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని, బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని జనం కోరుతున్నారు.

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

ముశిపట్లలో తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

మోత్కూరు, ఫిబ్రవరి 11: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రెడ్డి కులాలపై చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా మండలంలోని ముశిపట్లలో మంగళవారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రెడ్డి కులాలను తిట్టినంత మాత్రన పెద్ద లీడర్ అవుతాననే వైఖరి విచారకరమన్నారు. ఇలాంటి అనుచిత వాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు సోలిపురం చెన్నారెడ్డి, నవీన్‌రెడ్డి, యానాల దామోదర్‌రెడ్డి, కొణతం రాంరెడ్డి, ముప్ప రాజిరెడ్డి, పైళ్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

జబీనాబేగం (ఫైల్)

అడ్డగూడూరు, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బొడ్డుగూడెం శివారులో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూరు మండలం దాచారం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా జబీనాబేగం(54) విధులు నిర్వహిస్తున్నది. ఆమె స్వస్థలం సూర్యాపేట. హైదరాబాద్‌లోని తార్నాకలో నివాసం ఉంటుంది. ఆమె దాచారం పాఠశాల నుంచి అడ్డగూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ మీటింగ్‌కు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దాంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆమె భర్త ఎండీ అంజద్‌ఆలీ ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వాహనం ఆచూకీ కోసం సీసీ కెమెరాల్లో చూస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి11: అతివేగంతో ఓ కారు బైక్‌ను ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. యాదగిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం మండలంలోని చిన్న కందుకూరు పరిధి గ్రామమైన గోధుమకుంట 163 జాతీయ రహదారి వద్ద రేణికుంట శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఇన్నోవా కారులో అతివేగంగా వరంగల్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి ఎండీ అస్లాం(27)తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున వ్యక్తి ఇబ్రహీంసోహెల్‌కు గాయాలు కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనంపల్లి గురుకులానికి కదిలిన యంత్రాంగం

- కలెక్టర్ ఆదేశాలతో వైద్య శిబిరం.. శానిటేషన్ డ్రైవ్

జనంపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామన్నపేట, ఫిబ్రవరి11 : మండలంలోని జనంపల్లి గురుకుల పాఠశాలలో సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి ఆయన పరిశీలనలో వచ్చిన పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు మండల యంత్రాగం కదిలి పనులను ప్రారంభించింది. మునిపంపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చర్మవ్యాధుల వైద్యులు, ఇతర వైద్యులతో కలిసి గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 540 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో గజ్జి, తామెర, చర్మ, ఎలర్జీ వ్యాధులతో బాధపడుతున్న 148 మంది విద్యార్థులను గుర్తించారు. జలుబు, దగ్గు, జ్వరం ఇతర రోగాలతో బాధపడుతున్న 277మంది విద్యార్థులను పరీక్షించి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులు, గజ్జి తామెర, చర్మ, ఎలర్జీ వ్యాధులపై అవగాహన కల్పించారు. తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. చెత్త చెదారం తొలగించి పారిశుధ్యం మెరుగుపరిచారు. అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పీఆర్‌ఏఈ గాలయ్య ఆధ్వర్యంలో సోలార్ ఫినిషింగ్, ఫ్యాన్లు, లైట్లు, డైనేజీ, నల్లాల మరమ్మతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చర్మవ్యాధి నిపుణులు నాగరాజు, ప్రవీణ్, మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్, వైద్యులు వెంకట్, చందస్వీ, ఎంపీఓ రవూఫ్ అలీ, పాఠశాల ప్రిన్సిపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయిస్తున్న తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్

ఎమ్మెల్యే సామేల్ కొత్తగా మంజూరు చేసిన నిధులేమీ లేవు

- మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాకూబ్‌రెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 11: మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కొత్తగా మంజూరు చేసిన నిధులేమీ లేవని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. మోత్కూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మంజూరు చేయించిన నిధులతోనే కాలయాపన చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సామేల్ మంజూరు చేయించిన ప్రభుత్వ జీఓ పత్రాలతో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను అడ్డుకొని, కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను ఇబ్బందులు పెడుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సామేల్ ఏకపక్ష నిర్ణయాలతో పార్టీలో ఆయన వ్యతిరేకం వర్గంగా ఏర్పడిన నాయకులను సమన్వయం చేసుకోలేక నిత్యం బీఆర్ఎస్ పార్టీని, ఉద్యమ నేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తిట్టినంత మాత్రన ప్రజలు సామేల్‌ను నమ్మరని చెప్పారు. సామేల్ బీఆర్ఎస్‌తోనే ఎదగడానికి కారణమైన విషయాన్ని మర్చిపోవద్దన్నారు.

విద్యా ఆగ్రో రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

రామన్నపేట, ఫిబ్రవరి 11 : మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలోని విద్యా ఆగ్రో రైస్ మిల్లులో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. రైస్ మిల్లులోని రికార్డులు, ధాన్యం, బియ్యం నిల్వలను పరిశీలించారు. రాత్రి వరకు తనిఖీలు పూర్తి కాలేదు. బుధవారం కూడా తనిఖీలు నిర్వహించి పూర్తి వివరాలు తెలుపనున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎండీ గౌస్, సివిల్ సప్లయ్ డీఎం హరి కృష్ణ, ఏఎస్ఓ రోజారాణి, డీటీ బాలమణి లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ మహదేవరెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి11 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందివ్వాలన్నారు. వంట చేసే ప్రాంతాలను వంట ఏజెన్సీలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

'రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

భువనగిరిలో సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 11: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సనాతన హిందు దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి అన్నారు. భువనగిరి పట్టణంలో మంగళవారం సనాతన హిందు దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగరాజన్‌పై కిరాతకంగా భౌతిక దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. దాడిచేసిన వారిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు కప్పగంతుల నాగరాజుశర్మ, ఉత్సవ సమితి అధ్యక్షుడు రత్నపురం శ్రీశైలం, పచ్చలకట్ట సోమేశ్వరాలయం చైర్మన్ కొల్లూరి రాజు, నాయకులు తాడెం రాజశేఖర్, మచ్చ నర్సింహగౌడ్, సత్యనారాయణచారి, అర్చకులు భీష్మ, మనీ, కాలేర్ లక్ష్మణ్, శివ, మురళీ, అశోక్‌గౌడ్, ఐలయ్య, ఆంజనేయులు, చారి రాజు, ప్రేమ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

ఓటర్ ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 11 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 28, 378 మంది ఓటర్లకుగానూ 14,197 మంది పురుషులు, 14,181 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. మండలంలో 54 పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై 13న అభ్యంతరాలు సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు అపర్ణ, చంద్రకళ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

15 లోపు నేతన్న పొదుపు పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఓ శ్రీనివాసరావు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 11 : ఈ నెల 15 లోపు అర్హులైన చేనేత కార్మికులు నేతన్న పొదుపు పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని చేనేత సహకార సంఘ పర్సన్ ఇన్‌చార్జి, డీఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక చేనేత సహకార సంఘంలో మంగళవారం చేనేత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు పథకాన్ని అమలు చేస్తున్నదని, జియో టాగింగ్ మగ్గం కలిగి చేనేత వృత్తి చేస్తున్న వారందరూ అర్హులని పేర్కొన్నారు. చేనేత కార్మికుడితోపాటు అనుబంధ కార్మికులు, ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతా జిరాక్సులు, నామిని జిరాక్సులు దరఖాస్తులకు జతపరచి చేనేత సహకార సంఘంలో అందజేయాలని సూచించారు. ఆయనతోపాటు చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు, క్యాషియర్ పట్నం ప్రహ్లాద్, ఆడపు శీను, పండరినాథ్ ఉన్నారు.

ప్రభుత్వ పాలనపై రహస్య సర్వే

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి11 : కాంగ్రెస్ సర్వే ప్రజా పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన విధానాలను తెలుసుకునేందుకు మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల నుంచి రహస్య సర్వే చేస్తున్నట్లు సమాచారం. ఓ ప్రైవేట్ సంస్థ సర్వే ద్వారా 10 మంది సభ్యుల బృందం గ్రామాల్లో పర్యటించి ఒక్కో గ్రామంలో వందమంది వరకు ప్రజా పాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. అధిక శాతం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజా పాలన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఇవ్వకుండా మోసం చేస్తున్నారని సర్వే చేసే సభ్యులకు వెల్లడిస్తున్నట్లు సమాచారం.

నేటి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహ్మ

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : కేంద్ర బడ్జెట్ – గ్రామీణ పేదలపై ప్రభావం అనే అంశంపై బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సులో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణ వ్యవసాయ కూలీలకు, రైతులకు, పేదలకు, ఉపాధి హామీ కార్మికులకు, వృత్తి దారులకు తీవ్రమైన నష్టం జరిగిందని పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి కార్మికులకు రూ.2.5 లక్షల వేల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నదని తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా శ్యాంసుందర్

బాధ్యతలు చేపడుతున్న శ్యామ్‌సుందర్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : మండల ప్రత్యేకాధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపడుతానన్నారు. ఎంపీడీఓ సీహెచ్. శ్రీనివాస్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జట్ల రాము (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ యువకుడు సోమవారం అర్ధరాత్రి మృతి చెందిన ఘటన భూదాన్‌పోచంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన జట్ల రాము (38) మాస్టర్ వీవర్ వద్ద కూలీకి పని చేస్తూ జీవన సాగిస్తున్నాడు. ఈ నెల 9న జట్ల రాము తన బైకుపై స్నేహితుడు జల్లా దేవేందర్‌తో కలిసి జలాల్‌పూర్ నుంచి పోచంపల్లికి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో వారి బైకును ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీకొట్టింది. దీంతో రాముతో పాటు దేవేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న జట్ల రామును హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారి సోమవారం అర్ధరాత్రి జట్ల రాము మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి బాబాయ్ జట్ల దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రాజాపేట మండల ప్రత్యేక అధికారిగా శాంతి నిర్మల

రాజాపేట, ఫిబ్రవరి 11 : మండల ప్రత్యేక అధికారిగా శాంతి నిర్మలను నియమిస్తూ మంగళవారం కలెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

ధాన్యం సేకరణలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : యాసంగి 2024-25 సంవత్సరానికి సంబంధించి ధాన్యం సేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. భువనగిరి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వానకాలం పంట కాలంలో ధాన్యం సేకరణ సజావుగా జరిగిందని, అదే విధంగా యాసంగిలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఇప్పటినుంచి ధాన్యం సేకరణకు సంబంధించిన సన్నాహాలు చేయాలని తెలిపారు. గత సీజన్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏజెన్సీ అధికారులు మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని, క్రమ పద్ధతిన కోతలు జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అందులో భాగంగా హార్వెస్టర్ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ యాసంగిలో గత సీజన్ కంటే రెట్టింపు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నందున దానికి తగినట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో, మిల్ పాయింట్లలో సరిపడా హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో సుమారు 395 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలతో సేకరించాలని అన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సాయికృష్ణ, జిల్లా కోపరేటివ్ అధికారి రవీందర్, సహాయ పౌర సరఫరాల అధికారిని రోజా, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భువనగిరి పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, పక్కన మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు

బీఆర్ఎస్ హయాంలోనే భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు తగవు
- బీఆర్ఎస్ నేతలు కిరణ్‌కుమార్, ఆంజనేయులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 11: భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సారథ్యంలోనే జరిగిందని బీఆర్ఎస్ భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భువనగిరి పట్టణంలో పెద్ద చెరువు, ప్రభుత్వ కళాశాల గ్రౌండ్, అర్బన్ కాలనీకి రోడ్డు, ప్రధాన రహదారి వెడల్పు, టవర్స్ ఏర్పాటు, ప్రగతినగర్‌లో ఇండ్ల పై నుంచి పోతున్న లెవన్ కేవీ లైన్ మార్పు, హైదరాబాద్ చౌరస్తా నుంచి ఖాజిమొహల్లా చౌరస్తా వరకు కార్లు పోవడానికి వీలుగా రోడ్డు మార్పు చేసింది పైళ్ల శేఖర్‌రెడ్డి అని గుర్తు చేశారు. 10 ఏండ్లలో అవినీతి మచ్చలేని వ్యక్తి మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డినే అని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కాకుండా సొంత నిధులతో ప్రతి గ్రామం, మున్సిపాలిటీలలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాడని అన్నారు. నియోజకవర్గంలో ఆడబిడ్డల పెండ్లిళ్లు, విద్యార్థుల చదువులు, కళ్యాణలక్ష్మి పథకంతోపాటు వధూవరులకు దుస్తులు, ప్రజల